క్లుప్తంగా

సన్మానం..



పరకాల: సివిల్ ఎస్సైగా నియామకమైన రిటైర్డ్ సైనికాధికారి పిట్ట రాజేష్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజేష్ దంపతులు, వారి తల్లిదండ్రులను అభినందిస్తూ ఎమ్మెల్యే సన్మానించారు. సివిల్ ఎస్సైగా విధులు నిర్వర్తించి మంచి పేరుతెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, 12వ వార్డు కౌన్సిలర్ బండి రాణీతో పాటు బీఆర్ఎస్ నాయకుడు బండి సదానందం, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



శాయంపేట : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాల్లో గల రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్‌లు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీట్ ఓపెన్ అయ్యిన కారణంగా నడవడిక మార్చుకోవాలని సూచించారు. సమాజంలో మంచిగా జీవించాలని, ఎలాంటి నేరాలకు పాల్పడవద్దని సూచించారు. గొడవలు, సెటిల్మెంట్‌లకు వెళ్లి చట్టాన్ని చేతిలోకి తీసుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు.

తహసీల్దార్‌గా సుభాషిణి



శాయంపేట : మండల తహసీల్దార్‌గా సుభాషిణి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా పని చేసిన చల్లమల్ల రాజు కరీంనగర్‌కు బదిలీకాగా ఐనవోలు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన సుభాషిణిని శాయంపేట తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా డీటీ భద్రునాయక్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

సీఐకి సన్మానం..



శాయంపేట : ఇటీవల రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లేష్‌ను స్థానిక సర్పంచ్ కందగట్ల రవి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట చేనేత సహకారం డైరెక్టర్ దిడ్డి ప్రభాకర్, నాయకులు సామల మల్లయ్య, చింతల వెంకట్‌రాం, నర్సయ్య, వినుకొండ శంకరాచారి, రాజ్‌కుమార్, సాదీక్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



కమలాపూర్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి నక్క సమన్విత్ రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో సమన్విత్ ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం సమన్విత్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం..

ఆత్మకూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ న్యాయం జరగడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రధానకార్యదర్శి తనుగుల సందీప్ గురువారం ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు అనేక పథకాలను ముందుకు తీసుకొస్తుందని, వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రతీ నిరుపేదకు అమలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నియామకం

కమలాపూర్ : హుజూరాబాద్ నియోజకవర్గ ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఉస్మానియా యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, అంబాల గ్రామానికి చెందిన బోయిన హనుమాన్ ప్రసాద్‌ను నియమిస్తూ ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ గురువారం ఉత్తర్వులు జారీ చేసారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వెల్లువలా 'గృహలక్ష్మి' దరఖాస్తులు



శాయంపేట : బందోబస్తు నడుమ దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ఐనవోలు : ప్రత్యేక కౌంటర్ల ద్వారా అప్లికేషన్లు స్వీకరిస్తున్న కార్యదర్శులు



కమలాపూర్‌లో..

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం లబ్ధిదారులతో పాటు అధికారులను టెన్షన్ పెడుతోంది. గురువారంతో గడువు ముగుస్తుందని సమాచారంలో లబ్ధిదారులు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కిక్కిరిపోయారు. అధికారుల చుట్టూ జనం చేరడంతో అధికారులు పోలీస్‌లకు సమాచారం అందించారు. దీంతో పోలీసుల బందోబస్తు మధ్య గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వరకూ 3,310 దరఖాస్తులు స్వీకరించగా, తహసీల్దార్ కార్యాలయంలో 9,24 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే భూపాలపల్లి నియోజకవర్గానికి 3వేల మందికి మాత్రమే గృహలక్ష్మి పథకం అమలు చేయగా ఒక శాయంపేట మండలంలో 4,234 దరఖాస్తులు రావచ్చాయి.

ఐనవోలులో..

ఐనవోలు: మండల వ్యాప్తంగా మూడు రోజుల్లో 3,591 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ గురువారం ప్రకటనలో తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో 2,996, స్టేషన్ ఘణపూర్ పరిధిలో 595 అప్లికేషన్‌లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుకు చివరిరోజుగా భావించిన లబ్ధిదారులు ఒక్కసారిగా కార్యాలయంకు తరలివచ్చారు. దీంతో అధికారులకు ఇబ్బందులు తప్పలేదు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా గృహలక్ష్మి పథకానికి గురువారం చివరి రోజు 3,750 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ పల్లవి వెల్లడించారు. మొత్తం 7,417 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. గత మూడు రోజుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నప్పటికీ గురువారం చివరిరోజు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జోరురందుకోగా లబ్ధిదారులతో కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి.

'చేనేత'ను నీరుగారుస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న సాంబయ్య

శాయంపేట : చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తుందని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత 10 ఏళ్లలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ముడి సరుకులపై జీఎస్టీ విధిస్తూ చేనేత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయని మండిపడ్డారు. చేనేత వస్త్రాల తయారీకి ముడి సరుకు నుంచి రంగుల అద్దకం అచ్చులు అతకడం, కండెలు చుట్టడం, భీములు పోయడం, మగ్గాలకు జియో టాగింగ్ చేయనందున ప్రభుత్వ పథకాలు అందడం లేదని అన్నారు. చట్టసభల్లో జనాభా ప్రకారం చేనేతపై జీఎస్టీ ఎత్తివేయాలని, రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలని, అర్హులైన చేనేతలకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పద్మశాలి బంధు, క్యాష్ క్రెడిట్ రుణమాఫీ చేపట్టాలని అన్నారు. మండల కార్యదర్శి తట్ల రమేష్, ఆడెపు అశోక్ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన జాతీయ జెండాల ఆవిష్కరణ



చెరువుకట్ట పై జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు



మొక్కలతో వేసిన చిత్రం

ఆత్మకూరు : మేరా మిట్టి, మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గురువారం జాతీయ జెండా ఆవిష్కరించారు. అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువు కట్టలపై జెండా ఆవిష్కరించారు. అన్ని గ్రామపంచాయతీల నుంచి మట్టి సేకరించి జిల్లాకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, రాము, సుధాకర్, సర్పంచ్ మనోహర్, కార్యదర్శి అనూష, దూరదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లోనే తహసీల్దార్ బదిలీ..!



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన తహసీల్దార్

ఐనవోలు: ఇటీవల జరిగిన బదిలీల్లో మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సుభాషిణి వారం రోజుల్లోనే మళ్లీ బదిలీ అయ్యారు. అయితే రాజకీయంగా ఐనవోలు మండలంలో కొన్ని పరిస్థితితులు నెలకొనడంతోనే తహసీల్దార్ బదిలీ అయినట్లు చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయ ట్రస్టు బోర్డు నియామక ప్రక్రియను హైకోర్టు నిలిపివేయడంతో అధికార పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంలో రాజకీయ ఒత్తిడి వలన దేవాదాయశాఖ జిల్లా అధికారుల తప్పిదాలతో రాష్ట్రస్థాయిలో పరువు పోయిందని పలువురు నాయకులు, మల్లన్న భక్తులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే తహసీల్దార్ వారం రోజులు కూడా పనిచేయకుండా బదిలీ అవడం చర్చనీయాంశంగా మారింది. కాగా వరంగల్ జిల్లా మైనార్టీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన విక్రమ్‌కుమార్‌ను ఐనవోలు తహసీల్దార్‌గా బదిలీ చేశారు. విక్రమ్‌కుమార్‌కు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి



మొక్కకు నీరు పోస్తున్న డీసీపీ రవీందర్

దామెర: శాంతిభద్రతలను పరిరక్షించాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, పోలీస్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. వివిధ సమస్యల పరిష్కారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. కేసులకు సంబంధించి రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ కోసం గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట పరకాల రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై ముత్యం రాజేందర్, ఏఎస్సైలు సిద్ధయ్య, రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తహరాపూర్‌లో వ్యవసాయ గణన

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామంలో గురువారం పరకాల డివిజనల్ ఉప గణాంక అధికారి శ్రీనివాసులు గణన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ స్థితిగతులను తెలుసుకోవడంతో పాటు అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక, ఆర్థిక విధాన రూపకల్పన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఐదు సంవత్సరాల కోసారి గణన నిర్వహిస్తుందని తెలిపారు. ప్రస్తుతం 11వ గణన చేయడం జరుగుతుందని దీని ఆధారంగా 2021–22 గణన ప్రణాళిక శాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏవో గంగాజమున, మండల ప్రణాళిక, గణాంక అధికారి కుమారస్వామి, ఏఈఓలు రాకేష్, శివకుమార్, అహ్మద్‌రజా, స్టెల్లా, పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శనలో మహిళలు

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంటోంది. దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత కార్మికులు, డిజైనర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వస్త్ర ప్రదర్శనలో ఫ్యాషన్ ప్రియులు తమకు కావాల్సినవి కొనుగోలు చేస్తున్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టి.వి.రావు మాట్లాడుతూ వివాహ, శుభకార్యాలు, పండుగలతో పాటు ఇతర సందర్భాల్లో ధరించే, దేశంలో పేరుగాంచిన వస్త్రాలైన ఉప్పాడ, కలంకారి, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కశ్మీర్ సిల్క్ చీరలు, బ్లౌసులు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జువెల్లరీ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 11తో ప్రదర్శన ముగుస్తుందని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



శాయంపేట : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని సన్నిహిత రిసెప్షన్, రికార్డ్ రూమ్, కోర్టురూమ్‌తో పాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటారు. పోలీస్ సిబ్బందికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు అండగా నిలిచి న్యాయం చేయాలని సూచించారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్‌లో తనిఖీలు

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ.రాహుల్ గురువారం తనిఖీలు నిర్వహించారు. మార్కెట్‌లో స్థలాలు (ప్లాట్లు) తీసుకున్న వారిలో కొందరు వ్యాపారం చేయకుండా అద్దెకు ఇస్తున్నారని, మరికొంత మంది అసలు వ్యాపారమే చేయడం లేదని వచ్చిన ఆరోపణలపై ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. మార్కెట్‌లో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టడంపై పొట్లురాని చిరు వ్యాపారులు తమకు వస్తాయన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి



జన్ను సాంబయ్య (ఫైల్)

దామెర: చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఊరుగొండలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివ్రకారం. గ్రామానికి చెందిన జన్ను సాంబయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఈ నెల 6 వ తేదీన గ్రామానికి చెందిన మల్లాడి తిరుపతిరెడ్డి ఎడ్ల బండిలో యూరియా బస్తాలు, ఇనుపనాగలితో వ్యవసాయ బావి వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో మర్గమధ్యలో ఎడ్లు బెధిరి పక్కకు దూసుకెళ్లగా సాంబయ్య కిందపడ్డాడు. దీంతో ఎడ్లబండి చక్రం కడుపుపై నుంచి వెళ్లడంతో పాటు తలకు బలమైన గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా గురువారం ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాంబయ్య మృతిచెందాడు. అతని కుమారుడు అమరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్తింపజేయాలి

హన్మకొండ అర్బన్: క్రిస్టియన్ మతం స్వీకరించిన దళితులు, ముస్లింలకు ఎస్సీ రిజర్వేషన్ వర్తింపజేయాలని వరంగల్ దయాసిస్ ఎస్సీ, బీసీ కమిషన్ సభ్యులు కొట్టె అశోక్, బైరిపాక ప్రభాకర్ కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి వినతిపత్రం అందించారు.

పేదలకు అండగా 'బీఆర్ఎస్'

హన్మకొండ: పేదలకు అండగా బీఆర్ఎస్ సర్కార్ నిలుస్తోందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని తన స్వగృహంలో 41మందికి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందించారు.

ఆర్ట్స్ కళాశాలలో అమృత్ మహోత్సవ్ ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరా మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమాన్ని హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య మాట్లాడుతూ దేశరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తు చేసుకోవాలన్నారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు



కండువా కప్పి ఆహ్వానినిస్తున్న ఎమ్మెల్యే

దామెర: బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు సుమారు 50 మంది గురువారం ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసి యువకులు, ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ చేరడం శుభపరిణయం అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. రైతు బీమా, రైతుబంధు, బీసీబంధు, దళితబంధుతో పాటు గృహలక్ష్మి పథకాలకు శ్రీకారం చుట్టిన ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. రాబోయే ఎన్నికలని దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం



సభ్యత్వం పొందిన పీఆర్టీయూ నాయకులు

ఎల్కతుర్తి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రావులకార్ వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆ సంఘం హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ ఉపాధ్యాయుల పక్షాన నిలిచి నిరంతరం పోరాడుతుందన్నారు. ప్రతీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేస్తుందని, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు పాటుపడుతుందన్నారు. సంఘం చేసిన కృషికి ప్రస్తుతం సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు చూపించిన చొరవే నిదర్శనమన్నారు. మండలంలో 30 మంది ఉపాధ్యాయులు పీఆర్టీయూ(టీఎస్) సభ్యత్వం తీసుకున్న సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వరయ్య, జబీన్, పద్మావతి, హేమలత, మంజులారెడ్డితో పాటు ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గిరిజనుల అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి: కాంగ్రెస్ పార్టీతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండా, ఇచ్చులపల్లిలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పేద ప్రజల కళలు సాకారం కావాంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. పల్లెలను అభివృద్ధి చేసింది, మారుమూల గ్రామాలకు రోడ్లు, తాగునీటిని అందించింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా తాను ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. తండాలకు రోడ్లు, గిరిజనులు ఉండటానికి ఇళ్లు లేక అనేక ఇబ్బందులకు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయబోయే పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ సభ్యుడు చిట్టంపల్లి అయిలయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు గుగులోతు రమేష్, సీనియర్ నాయకుడు పిడిశెట్టి కనుకయ్య, మాజీ సర్పంచ్ మంగ రామచంద్రం, చీకట్ల రాజయ్య, పోచంపల్లి రాజిరెడ్డి, నరేందర్‌గౌడ్, చందర్, రమేష్, బాషా, గణేష్, భిక్షపతి, తిరుపతి, సంపత్, ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు'తో విద్యాప్రమాణాల పెంపు..



శాయంపేట : మాట్లాడుతున్న వెంకటేశ్వర్ రావు



కమలాపూర్‌లో..



ఐనవోలులో..

శాయంపేట : విద్యార్థులకు విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకే ఉపాధ్యాయులకు బోధన శిక్షణ చేపట్టినట్లు కోర్సు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులకు బోధన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గణితంలో లక్ష్మి, సికిందర్, ఇంగ్లిష్ రిసోర్స్ పర్సన్‌గా పూల్‌సింగ్, అనితలు ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం కోర్సు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం గత ఏడాది నుంచి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు మంచి అనుభవం వస్తుందని, శిక్షణలో నేర్చుకున్న మెలకువలు తరగతి గదుల్లో ఆచరించాలని సూచించారు. విద్యార్థుల్లో గణిత సామర్థ్యాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇన్‌చార్జ్ అనురాధ, ఆర్పీలు సంధ్య, రజిత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ గురువారం ఆంగ్ల భాష శిక్షణ కార్యక్రమంతో ముగిసినట్లు కోర్సు డైరెక్టర్ పుల్లా సంపత్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ మల్లయ్య, రిసోర్స్ పర్సన్‌లుగా దయాకర్ రెడ్డి, రాజగోపాల్ వ్యవహరించినట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరాన్ని రాష్ట్ర పరిశీలకుడు పీడబ్ల్యూసీ పవన్ కుమార్, శ్రీనివాస్‌లు పరిశీలించినట్లు పేర్కొన్నారు.

ఐనవోలు: ఉపాధ్యాయులు పీరియడ్ ప్లాన్‌తో విద్యా బోధన చేయాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలో తొలిమెట్టు ఆంగ్లం శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఆయన మాటాడుతూ అభ్యాస పుస్తకాలను ఉపయోగించి విద్యార్థులకు తగిన నైపుణ్యాలు పెంపొందించాలని కోరారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక శ్రీహర్షుడు, రిసోర్స్ పర్సన్ వేణుగోపాల స్వామి, స్వప్న, బాలోజు బ్రహ్మాచారి, సీఆర్పీలు రాజ్‌కుమార్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాగిజావతో ఆరోగ్యం

ఐనవోలు: విద్యార్థులకు రాగిజావ అందించడం వలన పౌష్టికాహారలోపం తగ్గుతుందని పున్నేలు సర్పంచ్ కత్తి దేవేందర్ అన్నారు. గ్రామంలో గురువారం విద్యార్థులకు రాగిజావ అందించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మన ఊరు– మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల్లో పౌష్టికాహారలోపాన్ని గుర్తించి వారంలో మూడు రోజులు రాగిజావను అందిస్తుందన్నారు. హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్, దాత వేణుగోపాల్‌రావు, ఉపాధ్యాయులు యాకయ్య, కొమురయ్య, ఇందిరా, నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.